క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో భావనారుషి కల్యాణం



కల్యాణోత్సవంలో భద్రకాళి, భావనారుషి

నారాయణవనం: వార్షిక ఉత్సవాలలో భాగంగా మండలంలోని పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో శనివారం భద్రకాళీ సమేత భావనారుషి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తీర్థ ప్రసాదాలతోపాటు అన్నప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. రాత్రి స్వామి వ్యాఘ్ర(పులి) వాహనంపై గ్రామ వీధుల్లో విహరించారు. రుత్వికులు 11 గంటలకు భద్రకాళీ అమ్మవారితో భావనారుషి కల్యాణాన్ని నిర్వహించారు. దంపతులు, మహిళలు అక్షింతలు, ప్రసాదాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఉత్సవ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు వ్యాఘ్ర వాహనాన్ని అధిరోహించిన ఉత్సవమూర్తులు గ్రామ వీధుల్లో విహరిస్తూ హారతులను అందుకున్నారు. ఉత్సవాల్లో చివరిరోజైన ఆదివారం 11 గంటలకు మహానైవేద్య సమర్పణ, ప్రసాద వితరణ చేపడుతామని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు చక్రస్నానంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి.

సత్యవేడు విద్యార్థినులకు ఉత్తమ మార్కులు



డి.లావణ్య



వి.రోజా

సత్యవేడు: రాష్ట్ర స్థాయిలోని డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలల్లో సత్యవేడు బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఇద్దరు విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపల్ ప్రసూన తెలిపారు. జూనియర్ కళాశాలలో చదివిన సీనియర్ బైపీసీ విద్యార్థిని డి.లావణ్య 986/100, ఎంపీసీలో వి.రోజా 463/470 మార్కులు పొంది గురుకులల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం



మోదుగులపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దృశ్యం

ఏర్పేడు: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని మాజీ వలంటీర్లు సురేంద్ర, అయ్యప్ప, మహేష్, సంధ్య అన్నారు. శనివారం వారు మండలంలోని మోదుగులపాలెంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. వారు మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి రెండేళ్లపాటు ప్రజాసేవ చేసినట్లు వివరించారు. అలాంటి పరిస్థితుల్లో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రజల బాగోగులను పట్టించుకోకుండా హైదరాబాదులో కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నారని తెలిపారు. కరోనా వేళ సీఎం జగనన్న ప్రజల ఆరోగ్యంతో పాటు సంక్షేమ పథకాలను నిరంతరంగా అందించారని చెప్పారు. ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబునాయుడు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, నాయకులు మేర్లపూడి రాజేంద్ర, మంచు సురేష, హరి రాయల్, రమేష్, శ్రీనివాసులు, పవన్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో వాస్తవ సాక్షాత్కారం



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరాజు

పుత్తూరు: ధ్యాన క్రమంలో మన మనస్సును దేనిమీదైతే కేంద్రీకృతం చేస్తామో అది మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తుందని ధ్యాన జగత్ మాస పత్రిక పబ్లిషర్స్, ధ్యానరత్న డి.కేశవరాజు తెలిపారు. శనివారం స్థానిక విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సమావేశం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేశవరాజు మాట్లాడుతూ పిరమిడ్ ధ్యాన విశిష్టతను వివరించారు. అనంతరం బ్రహ్మర్షి పితామహ పత్రీజీ చిత్ర మెమొంటోలను పంపిణీ చేశారు. సమావేశంలో స్కూల్ అసిస్టెంట్ పుష్పావతి భర్త జ్ఞాపకార్థం సంఘ భవన అభివృద్ధి పనులకు రూ.50 వేలు విరాళాన్ని భాస్కర్‌రాజుకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు యుగంధర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం, పురుషోత్తమశెట్టి, రవిశంకర్, సుబ్రమణ్యం, రామలింగం, రామ్మూర్తిరాజు, చంద్రశేఖర్‌వర్మ, అరుణాచల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద యాత్రలో బియ్యపు మధుసూదన్‌రెడ్డికి సన్మానం



పార్టీలో చేరుతున్న వారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే



మరింత మంచి చేస్తా..

"ప్రపంచాన్ని కరోనా మహమ్మారి కమ్మేస్తే భయపడలేదు.. అందరూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయపడి ఇళ్లకే పరిమితమైతే.. నేను నా ప్రాణాన్ని పణంగా పెట్టి నన్ను గెలిపించిన ప్రజలకు సేవ చేశా.. అందరికీ అందుబాటులో ఉన్నా.. సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా చేశాను.. మీకు మరింత చేయాలని సీఎం జగనన్న భావించాడు.. అందుకే మీకోసం నన్ను ఎంపిక చేశాడు.. మీరు నాకు మళ్లీ అవకాశం ఇవ్వండి.. మీకు మరింత మంచి చేస్తా.. మీలో ఒకడిగా.. మీ ఇంటి బిడ్డగా తోడుగా ఉంటా" అని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన పట్టణంలోని 11, 12, 13, 14, 15 వార్డుల్లో ప్రజా ఆశీర్వాద పాదయాత్ర చేశారు. సంతమైదానం నుంచి బయలుదేరిన ఆయనకు అడుగడుగునా ఆయనకు జనం బ్రహ్మరథం పట్టారు. మళ్లీ కూడా మా ఎమ్మెల్యే మధన్నే అంటూ జనం హోరెత్తారు..

– శ్రీకాళహస్తి

అశేష జనవాహిని మధ్య ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రజా ఆశీర్వాద యాత్ర





ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధు



దోశెలు వేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధు

జగనన్న పాలనకే ప్రజల మద్దతు



ఎన్నికల ప్రచారం చేస్తున్న నూకతోటి రాజేష్



ప్రచారానికి స్కూటీ మీద వెళ్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్

నాగలాపురం: ఐదేళ్లుగా సంక్షేమ పాలన అందించిన ప్రజల హృదయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారని, మళ్లీ ఆయన పాలన వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారని సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ తెలిపారు. మండలంలోని కాలంజేరి, కృష్ణాపురం, వేంబాక్కం పంచాయతీల్లో శనివారం మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో నూకతోటి రాజేష్ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు, మహిళలు, పార్టీ శ్రేణులు హారతులతో డప్పు వాయిద్యాలతో, పూలజల్లుతో ఘన స్వాగతం పలికారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి కరపత్రాలను అందించి అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనకు చంద్రబాబునాయుడు పాలనకు తేడా గమనించాలని ప్రజలను కోరారు. ప్రతిపక్ష పార్టీలు, పచ్చ మీడియా కలిసి ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా సంక్షేమ పాలనను అందించిన జగన్‌ను ప్రజలు నుంచి దూరం చేయలేరని.. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే టీడీపీ కూటమి ప్రజలను ఇబ్బందులకు గురి చేసేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దుష్ట శక్తులన్నీ ఏకమవుతున్నాయని ప్రజలు గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారానే గుణపాఠం చెబుతారని నూకతోటి రాజేష్ తెలిపారు. ఒక్క సీఎం జగన్‌ను ఎదుర్కునేందుకు మూడు పార్టీలు అపవిత్ర పొత్తుతో ఎన్నికలకు సిద్ధమయ్యాయని, ఎంత మంది జట్టు కట్టి వచ్చినా జగనన్న పొత్తు జనంతోనే అని స్పష్టం చేశారు. మళ్లీ జగనన్న సీఎం అయితే రాష్ట్రంలో పేదరికం అనేది లేకుండా పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సుమతి, నాగలాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై సుధ, ఎంపీపీ సింధూ, వైస్ ఎంపీపీ కుమారి, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, జేబీఆర్ స్కూల్ చైర్మన్ మునిరత్నం, ఎంపీటీసీ రాజ, ఏలుమలై, శివకుమార్, ఉప సర్పంచ్ సభ్యురాలు సునీత, జగదీష్‌రెడ్డి, నాయకులు మహేష్‌రెడ్డి శ్యామ్, పళణి, మహేంద్రన్, వడివేలు, దేశప్పన్, దేశన్, ఉదయ్ కుమార్, కులశేఖర్, ధనరాజ్, ఉదయ్, చిరంజీవి, రాజమణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే సంక్షేమం



రేణిగుంట: తండ్లం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

- ఎన్నికల ప్రచారంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి

రేణిగుంట: రాష్ట్రంలో నిరుపేదల సర్వతోముఖాభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి అన్నారు. రేణిగుంట మండలం తండ్లం, కొట్రమంగళం గ్రామాలలో శనివారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు డబ్బు వాయిద్యాలు, బాణసంచా పేల్చి ఘనస్వాగతం పలికారు. ఆమె ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో తాము నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కూడిన బుక్‌లెట్‌లను పంచుతూ ఓటర్లకు వివరించారు. 30ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని శ్రీకాళహస్తిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుంటే మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా అందించిన సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందించారని, అందుకే మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు సి.తిరుమలరెడ్డి, రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, మండల పార్టీ అధ్యక్షుడు గంగారి రమేష్, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జువ్వల దయాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, రైతు సలహా మండలి నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్‌లు పాడి సోమలత, మల్లం మదన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ శశికిరణ్, మురళిరెడ్డి, కుమార్‌యాదవ్, నిర్మలమ్మ, వెంకటరమణ, రామయ్య, మనోహర్, రమేష్, మురగయ్య, మునెయ్య, దిలీప్, సంజీవ రెడ్డి, శేఖర్, కృష్ణయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.





ప్రచారం నిర్వహిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి, బియ్యపు శ్రీవాణిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముక్కంటి సేవలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్





ఆలయ ధ్వజస్తంభం వద్ద కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, స్వామివారి దర్శనానికి విచ్చేసిన ప్రేమి విశ్వనాథ్

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కార్తీకదీపం ఫేం ప్రేమి విశ్వనాథ్ కూడా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న వారిలో ఉన్నారు.

శ్రీరామనవమి ఏర్పాట్లపై సమీక్ష



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నెహ్రూవీధిలోని శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో ఈ నెల 17న జరగనున్న శ్రీరామనవమి వేడుకల ఏర్పాట్లను శనివారం ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు పరిశీలించారు. శ్రీసీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించాలని తెలిపారు. ఆలయ ఇంజినీరింగ్‌శాఖతో చర్చించారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసు శాఖ అధికారులతో కూడా మాట్లాడారు. కార్యక్రమంలో డీఈఓ ఏకాంబరం, ఈఈ నూకరత్నం, ఏఈఓ సతీష్‌మాలిక్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిద్ధం చేస్తున్న రామాలయం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట చర్యలు



అప్పంబట్టు పోలింగ్ కేంద్రం వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు




పిచ్చాటూరు పోలింగ్ కేంద్రం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పిచ్చాటూరు: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు శనివారం పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో సమస్యాత్మక కేంద్రాలైన పిచ్చాటూరు, అప్పంబట్టు పోలింగ్ కేంద్రాలను స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పిచ్చాటూరు, అప్పంబట్టు పోలింగ్ కేంద్రాలతోపాటు నీరువాయి, కారూరు, ఎ.కె.బేడు, ఎస్ఎస్‌బీ పేట పోలింగ్ కేంద్రాలు కూడా సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఈ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ సమయాల్లో అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం గ్రామస్తులతో ముచ్చటించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు స్థానిక ప్రజలు సహకరించాలన్నారు. ఎటువంటి అసాంఘిక సంఘటనలకు పాల్పడ్డా పార్టీలకు అతీతంగా కఠిన చర్యలు తప్పవని ఆయన సూచించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పుత్తూరులోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన దాతలు ఎం.రామ్మూర్తి కుటుంబ సభ్యులు శనివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు.

శాస్త్రోక్తంగా తైలాభిషేకం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాల్లో ఇరువర్గాల ఘర్షణ

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లిలో శుక్రవారం రాత్రి మహాభారత ఉత్సవాల్లో ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఎస్ఐ రాజకుల్లాయప్ప కథనం మేరకు.. 49 కొత్తపల్లి గ్రామం వద్ద జరుగుతున్న మహాభారత ఉత్సవాలకు కొత్తపల్లి మిట్ట దళితవాడకు చెందిన ధనుష్ వెళ్లాడు. అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడు. కొత్తపల్లి గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, సూరిరెడ్డి, నవీన్‌రెడ్డి, మునికన్నారెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఆగ్రహంతో ఊగిపోయారు. తమ ముందే కుర్చీలో కూర్చుంటావా అంటూ కులం పేరుతో దూషించడంతోపాటు దాడి చేశారు. దీంతో అవమానానికి గురైన ధనుష్ ఈ విషయాన్ని కొత్తపల్లి దళితవాడ యువకులకు చెప్పాడు. వారు గుంపుగా వచ్చి ధనుష్‌పై దాడి చేసిన వారితో ఘర్షణకు దిగారు. ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దళితులపై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే అగ్రవర్ణాలపై దాడి చేసిన ధనుష్, శ్యామ్, మహేష్‌పై దొమ్మీ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నగరి డీఎస్పీ కేఎస్ మూర్తి, కార్వేటినగరం సీఐ సత్యబాబు శనివారం రాత్రి గ్రామంలో విచారణ చేపట్టారు.



కొత్తపల్లిమిట్ట దళితవాడలో గ్రామస్తులతో చర్చిస్తున్న డీఎస్పీ కేఎస్ మూర్తి

అగస్త్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ మరకతవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం సాయంత్రం అంకురార్పణ చేశారు. పది రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాలు ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయని ఆలయ అర్చకులు రమేష్ గురుకల్, ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజాది కార్యక్రమాలను పూర్తి చేశారు. సాయంత్రం మరకతవల్లీ, అగస్త్యేశ్వర స్వామి ఉత్సవర్లు తిరుచ్చి వాహనంపై ఆలయ ప్రాకారంలో ఊరేగారు. అనంతరం నిర్మిత యాగశాలలో శాంతి, వాస్తు హోమాలను గణపతి పూజతో అర్చకులు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 6.30 గంటలకు నందీశ్వర చిత్రపటమున్న వస్త్రాన్ని ఆలయ ధ్వజస్తంభానికి అధిరోహింపజేయడానికి ఏర్పాట్లు చేపట్టారు. రాత్రి స్వామి వారు చంద్రప్రభ వాహనంపై సముదాయం గ్రామ వీధుల్లో విహరిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం సముదాయం గ్రామ వీధుల్లో వాహన సేవలను నిర్వహిస్తున్నట్లు నాగరాజు తెలిపారు. 15న సోమవారం సాయంత్రం సింహవాహనంపై, 16న మంగళవారం హంస వాహనంపై, 17న బుధవారం శేష వాహనంపై, 18న గురువారం నంది వాహనంపై, 19న శుక్రవారం గజ వాహనంపై ఉత్సవర్లు గ్రామోత్సవం, 20న శనివారం రాత్రి రథోత్సవం, 21న ఆదివారం సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం, రాత్రి అశ్వ వాహనంపై, 22న సోమవారం ఉదయం నటరాజ ఉత్సవం, సాయంత్రం రావణేశ్వర వాహనంపై ఉత్సవర్లు సముదాయం వీధుల్లో విహరిస్తారు. 23న మంగళవారం ఉదయం త్రిశూల స్నానం అనంతరం సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. 21న ఆదివారం సాయంత్రం జరిగే ఆర్జిత కల్యాణంలో రూ.500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు.



ఊరేగింపులో వినాయకుడు